క్లుప్తంగా

26 నుంచి అంకమ్మతల్లి తిరునాళ్ల

దాచేపల్లి : నగర పంచాయతీలో వేంచేసి ఉన్న శ్రీ వీర్ల అంకమ్మతల్లి కొలుపుల తిరునాళ్ల మహోత్సవం ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభంకానున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఐదు రోజుల పాటు అమ్మవారి కొలుపుల తిరునాళ్ల జరుగుతుంది. ఐదు రోజుల పాటు ప్రత్యేక హోమాలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుగుతాయి. ఆఖరి రోజు అమ్మవారి వార్షిక కల్యాణం జరుగుతుంది.

చింతపల్లిలో జనార్ధనస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



కారెంపూడి: మండలంలోని చింతపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీ భూనీళా సమేత జనార్ధనస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 29వ తేదీ నుంచి వచ్చే నెల రెండవ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరుగుతాయని దేవాదాయ శాఖ ఆలయ ఈఓ పి సైదమ్మబాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తేదీ స్వామి వారి కల్యాణోత్సవం జరుగుతుందని ఈ సందర్భంగా మహాన్నదాన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్ర ప్రకారం బ్రహ్మోత్సవాలను యాజ్ఞీకులు కొండవీటి వేణుగోపాలాచార్యులు, అర్చకుడు మారేపల్లి జగదీష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తారని ఈఓ తెలిపారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



పిడుగురాళ్ల: ఎంతో మందికి సేవ చేసే రోటరీ క్లబ్ కుటుంబ సభ్యులకు వైద్యసేవలు చేయడం ఎంతో ఆనందంగా ఉందని డాక్టర్ శరత్‌చంద్ర అన్నారు. పట్టణంలోని వికాస హాస్పటల్‌లో రోటరీ క్లబ్ సభ్యులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ సభ్యులు సమస్య ఎక్కడా ఉన్నా వారు స్పందించడం జరుగుతుందని, అలాగే వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను కూడా అందించడం జరిగిందన్నారు. అనంతరం వివిధ రోగాలపై వారికి అవగాహన కల్పించారు. రోగాలకు సంబంధించి చేయాల్సిన వ్యాయామాల గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు ఉన్నారు.

గిరిజనుల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

గిరిజన విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ నాగేశ్వరనాయక్

గురజాల : గిరిజనుల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమైందని వైఎస్సార్ సీపీ గిరిజన విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ బాణావత్ నాగేశ్వర నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం గురజాల్లో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడు గిరిజనులను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. తెలుగుదేశం హయాంలో కేవలం గ్రామాల్లో ఫ్యాక్షన్ రాజకీయాలు పెరిగిపోయాయన్నారు. మాచవరం మండలంలో గిరిజన శంకారావం నిర్వహించి గురజాల , మాచర్ల ఎమ్మెల్యేలను విమర్శించడమే పనిగా సభను మొదలు పెట్టారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు చేసిన మంచి పనులు, వారికి అందించిన సంక్షేమ ఫలాలు గురించి ఒక్క మాట అయినా మాట్లాడలేదని విమర్శించారు. గిరిజన ద్రోహిగా చంద్రబాబు నాయుడు చిరస్థాయిగా నిలిచిపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షుడు బాణావత్ మహేష్ నాయక్ తదితరులున్నారు.

అమ్మవారి ఆలయంలో అన్నదానం

మాచర్ల: పట్టణంలోని సాయిబాబా కాలనీలో వేంచేసియున్న శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఉదయం నుంచే శ్రీ మాత అన్నపూర్ణేశ్వరిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కుంకుమార్చన, వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా అక్షయ తృతీయ పురస్కరించుకుని అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని జరిపారు. వందలాది మంది మహిళలు అమ్మవారి జన్మదిన వేడుకలు, పూజల్లో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పట్నంబజార్: ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచర్ల ప్రాంతానికి చెందిన షేక్ మదార్ (19) తల్లిదండ్రులు సెల్‌ఫోన్ ఇవ్వలేదనే కారణంతో ఈ నెల ఒకటో తేదీన గడ్డి మందు తాగాడు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ, అభివృద్ధి పథకాలే మా ధైర్యం

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



లబ్ధిదారురాలికి సంక్షేమ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలతో ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నామని గురుజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామాపురం గ్రామంలో గడప గడపకు ప్రభుత్వం రెండవ రోజు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన ప్రతి ఒక్కరి ఇంటి గడప వద్దకు ఎమ్మెల్యే కాసు వెళ్లి ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన పథకాల వివరాలను వారికి వివరించారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ భారతదేశంలో ప్రజల గడప వద్దకు వెళ్లి ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయని తెలుసుకుంటున్న ఏకైక రాష్ట్రం ఏపీ మాత్రమేనని, ఓట్ల కోసం కాకుండా ప్రజల కోసమే గడప గడప వద్దకు తాము వెళ్తున్నామని ఆయన స్పష్టం చేశారు. సీఎం జగన్ ప్రభుత్వం చేసిన గొప్ప పనుల వలనే తాము ప్రజల్లోకి వెళ్తున్నామని, ప్రజల నుంచి వస్తున్న ఆదరణ అద్భుతంగా ఉందని ఆయన చెప్పారు. ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగనన్ననే మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే కాసు అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఈ పథకాలన్ని తీసేస్తామని టీడీపీ నాయకులు చెబుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, టీడీపీ నాయకులు ఎన్ని అబద్ధాలు చెప్పిన ప్రజలు వినే పరిస్థితిలేరన్నారు. ప్రజలు ఇప్పటికే సీఎం జగన్‌కు అండగా ఉండేందుకు నిర్ణయించుకున్నారని, ప్రజల ఆశీస్సులతో మరోసారి జగన్ సీఎం కావడం తథ్యమన్నారు. రామాపురం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తామని, గ్రామంలోని మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కాసు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాలనీల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేందుకు నిధులు కేటాయిస్తామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నిత్యం ప్రజల్లో ఉండాలనిన ఎమ్మెల్యే కాసు నాయకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, ఎంపీటీసీ ఆకూరి వెంకటరెడ్డి, ఆకూరి కాశీరెడ్డి, సర్పంచ్‌లు నన్నేబోయిన వెంకయ్య, గుర్రం సైదులు, కూసం నాగిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కర్నాటి సైదారెడ్డి, మాశెట్టి పుల్లారావు, మాజీ ఎంపీటీసీ ఆకూరి వీరారెడ్డి, నాయకులు పరిమి బాబు, గురవారెడ్డి, నాగిరెడ్డి, కుంపటి చింతయ్య, రామా సైదులు, గుర్రం వెంకటేశ్వర్లు, అనుముల ఏసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో కూడిన వర్షం



చిరుజల్లుతో కురుస్తున్న వర్షం



కల్లంలో ఆరబోసిన మిర్చిపంట



బస్టాండ్ సెంటర్‌లో గాలివానకు తెగి నీటిలో పడిన విద్యుత్తు వైర్లు

మాచర్ల: ఒక్కసారిగా వాతావరణం మారింది. ఉదయం నుంచి 3గం''ల వరకు భగభగ మండిన మాచర్లలో ఆకస్మికంగా వాతావరణం మారింది. భారీ స్థాయిలో ఈదురుగాలలు వీచాయి. గాలి ప్రభావం తీవ్రంగా ఉండటంతో రోడ్ల పై నడవడానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అనంతరం చిరుజల్లు వర్షం కురిసింది. మండుటెండ నుంచి వాతావరణం మారడంతో హమ్మయ్య తాత్కాలికంగా ఇబ్బంది తొలగిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పలు గ్రామాల్లో వడగండ్ల వాన

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వడగండ్లతో కూడిన అకాల వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం సుమారు అర్ధగంట పాటు కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. మండలంలో ఈ ఏడాది మొదటి సారిగా వర్షంతో పాటు చిన్నపాటి వడగండ్లు కురవడంతో మండల ప్రజలు సంభ్రమాశ్చర్యానికి గురయ్యారు. అకాల వర్షంతో మిర్చి రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. కల్లాల్లో ఉన్న మిర్చిని కాపాడుకునేందుకు నానాఅవస్థలు పడ్డారు. అక్కడక్కడ పెను గాలులు వీయడంతో పండ్ల తోటలు దెబ్బతిన్నాయి.

పిడుగురాళ్లల్లో వర్షం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని సాయంత్రం 3 గంటల నుంచి ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కూడిన వర్షం పడింది. అయితే మిర్చి పంట కల్లంలో ఉండడంతో రైతులు ఆందోళన చెందారు. పరదా పట్టల కోసం ఉరుకులు, పరుగులు తీసి పంట నష్టం పోకుండా పాకాడుకున్నారు. అంతేకాకుండా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

కారెంపూడిలో వర్షం

కారెంపూడి: కారెంపూడి మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. గాలులకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్తు తీగల మీద పడడంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. బస్టాండ్ సెంటర్‌లో, వాసవి నగర్ ప్రాంతంలో విద్యుత్తు లైన్లపై చెట్ల కొమ్మలు పడ్డాయి. విద్యుత్తు సిబ్బంది అప్రమత్తమై విద్యుత్తు సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదాలు ఏమీ జరగలేదు. ఇదిలా ఉంటే మరో వైపు త్రీ ఫేజ్ కరెంటు లైన్ల మరమ్మతు పనులు కొనసాగుతుండడంతో వర్షం వల్ల ఆ పనులకు అంతరాయం కలిగిందని ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. మ్యాట్రిక్స్ వద్ద విద్యుత్తు లైన్‌పై సుబాబుల్ చెట్లు వాలి ఉన్నాయని వాటిని సోమవారం ఉదయం తొలగిస్తామన్నారు. ఇదిలా ఉంటే హార్వెస్టర్లతో వరికోతలు చేయిస్తున్న రైతులు వర్షంతో ఇబ్బందులు పడ్డారు. వరికోతల పనులు నిలిచిపోయాయి. కోసిన ధాన్యాన్ని ఇళ్లకు చేర్చుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వరి కోతలు పూర్తయి పొలంలో ఉన్న వరి గడ్డి తడిసిపోయింది. ఇదిలా ఉంటే వేసవి పత్తి సాగు చేస్తున్న రైతులకు ఈ వర్షం మేలు చేసింది. ఉదయం నుంచి విపరీతమైన ఎండ కాసి మధ్యాహ్నం నుంచి ఆకస్మాత్తుగా ఆకాశం మేఘావృతమై వర్షం పడింది.

మా నమ్మకం నువ్వే జగనన్న



మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్లు, గృహసారథులు

పిడుగురాళ్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే భవిష్యత్ సాధ్యమవుతుందని పలువురు అన్నారు. పట్టణంలోని 33 వార్డులో ఆయా కౌన్సిలర్ల ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న, మా భవిష్యత్ నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమవుతుందన్నారు. అనంతరం వార్డులోని ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అదేవిధంగా పట్టణంలోని 26వ వార్డులో వార్డు కౌన్సిలర్ అన్నెం పద్మావతి బంగారు రెడ్డి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించి మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్‌ను అంటించారు. ఈ కార్యక్రమంలో బాషా, వడ్డెగుండ సాంబయ్య, వెంకటేశ్వర్లు, ముక్కాల నిరంజన్ తదితరులు ఉన్నారు.

ప్రతిభ కనబరచిన కార్తీక్

గురజాల : విశాఖపట్నంలో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పల్నాడు జిల్లా గురజాలకు చెందిన కత్తి కార్తీక్ మంచి ప్రతిభను కనబరిచాడు. ఈ పోటీల్లో గోల్డు మెడలు సాధించి పల్నాడు ప్రాంత కీర్తిని రాష్ట్ర స్థాయిలో నిలిచే విదంగా చూసాడని పలువురు అభినందిస్తున్నారు. పల్నాడు ప్రాతం పరువు నిలిచిపోయేలా బంగారు పతకాన్ని సాధించడం ఆనందంగా ఉందని పలువురు క్రీడాకారులు కార్తీక్‌ను అభినందించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



పిడుగురాళ్లరూరల్: మండలంలోని పాతగణేశునిపాడు గ్రామంలో బుడగ జంగాల కానీలో లోకల్ టూ గ్లోబల్ అనే అంతర్జాతీయ కార్యక్రమం ద్వారా టీడీహెచ్ అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ఆర్ఎల్‌హెచ్‌పి మైసూరు వారి తోడ్పాటుతో రాజీవ్ గాంధీ మెమోరియల్ హైస్కూల్, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ వారి సహకారంతో మొక్కల నాటే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ కన్నతల్లిని మరిచినా, నేలతల్లిని మరిచాన మానవజన్మకే అర్థం లేదన్నారు. కాలనీలో 24 మొక్కలు నాటి, వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మధు ప్రసాద్, గ్రామ సర్పంచ్ శ్రీను, వలంటీర్లు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీ అమ్మ జ్యోతి ఉత్సవాలు ప్రారంభం



కుంకుమ బండ్ల ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: పాతూరులోని చౌడేశ్వరీ అమ్మవారి ఏకాదశ జ్యోతుల మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి అభ్యంగన స్నానం, అలంకరణ, పూజాదికాలను నిర్వహించారు. తొలిరోజు ప్రధాన ఘట్టమైన కుంకుమ బండ్ల ఊరేగింపును ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. అమ్మ వారి చిత్రపటం అలంకరించిన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి స్వయంగా నడిపి ఊరేగింపును ప్రారంభించారు. ఆలయం వద్దకు చేరుకున్న డాక్టర్ గోపిరెడ్డికి శ్రీతొగట వీర క్షత్రియ అభివృద్ధి సంఘం ప్రతినిధులు, పూజారులు స్వాగతం పలికారు. శ్రీచౌడేశ్వరీ అమ్మవారికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పుస్తక పఠనంతో మేలు

చిలకలూరిపేటటౌన్: విద్యార్థులు పుస్తక పఠనం ద్వారానే జ్ఞానాన్ని సంపాదిస్తారని జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు చెప్పారు. ఆదివారం మండలంలోని వేలూరు గ్రామంలో గుర్రం జాషువా గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబాల్లో జరిగే శుభాకార్యాల్లో చిన్నారులకు పుస్తకాలను బహుమతిగా ఇచ్చి వారి విజ్ఞాన ఎదుగుదలకు దోహదపడాలన్నారు. పెద్దలు, పిల్లలకు ఇవ్వాల్సిన విలువైన ఆస్తి పుస్తకాలని చెప్పారు. అనంతరం 100 పుస్తకాలను గ్రంథాలయానికి విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొంతా తిరుపతయ్య, సొసైటీ అధ్యక్షుడు దాసరి చిట్టిబాబు, సభ్యులు గేరా ఏకోబు, పానుగుపాటి బుల్లిబాబు, షేక్ బాజీ, ఉదయ్, రమేష్ పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



వినుకొండ(నూజెండ్ల) : గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతిచెందిన ఘటన కురిచేడు- గుండ్లకమ్మ రైల్వేస్టేషన్ల మధ్యలో ఆదివారం జరిగింది. నరసరావుపేట రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 55 ఏళ్ల వ్యక్తి గూడ్స్ రైలు బండి కింద పడి ఆత్మహత్య చేసుకుని మరణించాడు. మృతుడు తెలుపు రంగు నిండు చేతుల చొక్కా ధరించి ఉన్నాడు. చేతుల మీద త్రిశూలం, గణేషుడి బొమ్మ పచ్చబొట్లు ఉన్నాయి. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రిలో మార్చూరీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు 9948525386, 9542424899 నంబరును సంప్రదించాలని రైల్వే పోలీసులు సూచించారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు



విజయపురిసౌత్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10గంటలకు 5వ తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 12 గంటలకు ముగిసింది. అలాగే మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగింది. కాగా 5వ తరగతిలో చేరేందుకు మొత్తం 231 మంది దరఖాస్తు చేసుకోగా 202 మంది ఎంట్రెన్స్ పరీక్షకు హాజరయ్యారు. అలాగే మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో చేరేందుకు 215 మంది దరఖాస్తు చేసుకోగా 173 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలను కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీరాజ్యం, వైస్ ప్రిన్సిపల్ దారా మేరీ మంజుల, అబ్జర్వర్ నాగజ్యోతిలు పర్యవేక్షించారు.

ఈద్గా అభివృద్ధికి రూ.1.56లక్షలు అందజేత



నగదును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు

మాచర్ల: పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా శనివారం ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల వైఎస్సార్ సీపీ రీజనల్ యువజన విభాగం కన్వీనర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు మాట్లాడుతూ ఈద్గా అభివృద్ధికి తమ వంతు సాయంగా రూ. 1.50 లక్షలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆదివారం మైనార్టీ నేత, కౌన్సిలర్ షేక్ మస్తాన్, బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఉప్పలపాటి జాని, కౌన్సిలర్లు షేక్ కరిముల్లా, మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్, కౌన్సిలర్లు షేక్ కరిముల్లా, షేక్ సుభానిల ఆధ్వర్యంలో నగదును పాత మాచర్లలోని మర్కాస్ పెద్ద మసీదు ప్రెసిడెంట్ అబ్దుల్ రహీంకు అందించారు. ఈ సందర్భంగా మైనార్టీ నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ పిఆర్కే, పివిఆర్‌లు ముస్లింల అభివృద్ధికి కోట్ల రూపాయలు ఇచ్చి ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. వ్యక్తిగతంగా రూ. 50వేలకు పై నిధులు కేటాయించి ముస్లింల అభివృద్ధికి పాటుపడుతున్నారు. మైనార్టీలకు అధిక ప్రాధాన్యతనిచ్చి నామినేటెడ్ కౌన్సిల్, ఎంపీపీ, ఎంపీటీసీలలో, జెడ్పిటీసీలో అవకాశాలు కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. గతంలో ముస్లిం మైనార్టీల పాత్ర నామమాత్రమేనన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక పిఆర్కే ఆధ్వర్యంలో ముస్లింకు అగ్రస్థానం దక్కటం సంతోషకరమన్నారు. పండుగ రోజు ఇచ్చిన మాటకు కట్టుబడి ముస్లింలకు రూ.1.56ల క్షలు ఈద్గా అభివృద్ధికి నిధులు ఇవ్వటం పై వారు పిఆర్కే, పివిఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజక వర్గ స్థాయిలో విస్తృతంగా తిరిగి మైనార్టీలను ఏర్పాటు చేసి మరోసారి జగన్‌ను సీఎం చేసేందుకు, పిఆర్కేను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ మైనార్టీ నేతలు షేక్ సులేమాన్ పాషా, సీలింగ్ బాషా, కణితి మస్తాన్, షేక్ సుభాని, సామ్రాట్, గౌస్, దరియా, నాగూర్, అల్లావుద్దీన్, రహమాన్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతం చేస్తున్న మహిళలు, సభ్యులు

మాచర్ల: గతంలో ఎన్నడూ లేని విధంగా కుల, మతాలకతీతంగా పట్టణంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో 100 మంది గర్భిణులకు వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో సీమంతం కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషించదగిన విషయమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, ఎస్ఐ అరుణ, వైద్యులు దాక్షాయణి, సిడిపిఓ పేర్కొన్నారు. సీమంతంలో భాగంగా గర్భిణులకు చీర, గాజులు, పసుపు, కుంకుమ, పలు వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గర్భిణీ చిన్నారికి జన్మనివ్వటమంటే మరో జన్మనెత్తినంత పనవుతుందని, ఎంత కష్టాన్నైనా భరించి చిన్నారులకు జన్మనివ్వడం ఎంతో గొప్పవిషయమని పేర్కొన్నారు. అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవ రావు మాట్లాడుతూ గర్భిణి అయిన ప్రతి మహిళ ప్రతి రోజూ ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకొని పండ్లు, పౌష్టికాహారం తీసుకోవటమే కాకుండా వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ప్రతి ఏటా గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు అధ్యక్షుడు విడేల శ్రీనివాసరావు, గవర్నర్ అడ్వైజర్ చుండూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గర్భిణులు ఎన్ని ఇబ్బందులున్నా ఆలోచన, ఆవేదన చెందకుండా ప్రశాంతంగా పౌష్టికాహారాన్ని తింటూ వైద్యుల సలహా పాటిస్తే ఆరోగ్యమైన బిడ్డకు జన్మనిస్తారన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, ప్రదాన కార్యదర్శి పందిరి నరసింహారావు, ఆర్య వైశ్య మహిళా సభ్యులు మేడా వెంకటలక్ష్మి, జాయింట్ సెక్రెటరీ రాజ్ కుమార్, చుండూరు సత్యనారాయణ, పరిటాల ధనలక్ష్మి తదితరులున్నారు.

దాహార్తిని తీర్చడం అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి విజయకుమార్

రెంటచింతల: రెండు తెలుగు రాష్ట్రాలలోనే ఎండలకు పేరు పొందిన రెంటచింతలలో ప్రయాణికులకు, పాదచారులకు దాహార్తిని తీర్చేందుకు సీపీఎం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయ మని సీపీఎం జిల్లా కార్యదర్శి విజయకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక బస్‌స్టాండ్ సెంటర్లో మండల కార్యదర్శి తిక్కా నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భగభగ మండే ఎండలతీవ్రతను దృష్టిలో పెట్టుకుని గ్రామస్తులకు చల్లటి మజ్జిగను, మంచినీటిని పంపిణీ చేసేలా చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. ఈ చలివేంద్రం వేసవికాలం అంతా కొనసాగేలా దాతలు, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. కార్యక్రంలో సీపీఎం మండల కార్యదర్శి తిక్కా నాగేశ్వరరావు, యు. పూర్ణయ్య, బుట్టి మరియదాసు, ఉమాభారతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

నేలవాలిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి

విద్యుత్ శాఖ ఏఈ కోటేశ్వరరావు



నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్

కారెంపూడి: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి కొన్ని చోట్ల పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయని, అలాగే విద్యుత్తు లైన్స్ కూడా నేలవాలాయని ఈ నేపథ్యంలో పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని వాటి దగ్గరకు వెళ్లవద్దని అలాంటి సమాచారం విద్యుత్తు శాఖ అధికారులకు అందించాలని మండల ఏఈ కోటేశ్వరరావు ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో కోరారు. వ్యవసాయ ఫీడర్లకు వెళ్లే విద్యుత్తు సరఫరాను నిలిపివేశామని అయినా కూడా ఎల్‌టీ లైన్లలో విద్యుత్తు ఉంటే అవకాశం ఉందని రైతులు పొలాలకు వెళ్లినప్పుడు విద్యుత్తు తీగలకు దూరంగా ఉండాలని వాటిని ఎవరూ తాకవద్దని హెచ్చరించారు. ఎలాంటి ప్రమాదాలకు గురి కాకుండా వాటికి దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాలకు వెళ్లే లైన్లు కూడా చెట్ల కొమ్మలు విరిగిపడి తెగిపోయాయని వాటిని పునరుద్ధరించి గ్రామాలకు విద్యుత్తు సరఫరా రాత్రి 7 గంటలకు పునరుద్ధరించామని తెలిపారు. ఇదిలా ఉంటే నరమాలపాడు విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మత్తులు సోమవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు చేయనున్నామని ఆ సమయంలో నరమాలపాడు, లక్ష్మీపురం గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

నేరాల నియంత్రణకు తనిఖీలు



చిలకలూరిపేట: నేరాల నియంత్రణలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు నరసరావుపేట డీఎస్పీ సి.విజయభాస్కర్ చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున పోలీసుశాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడారు. కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించరాదని సూచించారు. ఇళ్లు అద్దెకు ఇచ్చేటప్పుడు పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. తక్కువ ధరకు వస్తాయని సరైన పత్రాలు లేకుండా వాహనాలు కొనరాదని చెప్పారు. సరైన పత్రాలు లేని 24 బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ జి.రాజేశ్వరరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.